త్రికరణ శుద్ధితోనే భూ రికార్డుల ప్రక్షాళన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాలనా పగ్గాలు చేపట్టిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం భూముల సమస్యల పరిష్కారం కోసం ఇటీవల ఒక కార్యక్రమాన్ని ప్రకటించింది. యుద్ధ ప్రాతిపదికపై భూ రికార్డులు ప్రక్షాళన చేయాలని నిర్ణయించింది. పదిహేను రోజుల్లోగా ప్రతి రెవెన్యూ డివిజన్లో కనీసం ఒక రెవెన్యూ గ్రామంలోని భూ రికార్డులను తప్పుల్లేకుండా తయారుచేయాలని ఆదేశించింది. ఆ తర్వాత ఈ అనుభవం ఆధారంగా రాష్ట్రంలోని మిగిలిన అన్ని గ్రామాల రికార్డులను శుద్ధీకరించాలని ఆదేశాలు జారీ చేసింది. ఆదేశాలు జారీ అయి 15 రోజులు అయింది. ఈ నేపథ్యంలో కొన్ని అంశాలు చర్చిద్దాం.



1992–94సంవత్సరాలలో పశ్చిమగోదావరి జిల్లాలో నేను ఎమ్మార్వోగా పనిచేసేవాణ్ని. ప్రస్తుతం ప్రధాన భూకమీషనర్ (సిసిఎల్ఏ) గా వున్న డాక్టర్ మన్మోహన్ సింగ్ అప్పుడు పశ్చిమ గోదావరి జిల్లాకు జాయింట్ కలెక్టర్ గా పనిచేసేవారు. ఆ రోజుల్లో ఆయన భూ సంబంధిత రికార్డుల శుద్ధీకరణ కోసం ఒక ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఎమ్మార్వో ప్రయోగాత్మకంగా ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని ఆ గ్రామంలోని అన్ని సర్వే నెంబర్లు, వాటి విస్తీర్ణం, యజమాని వివరాలు సరిచూసి వ్యత్యాసాలు ఉంటే సరిచేయాలి, అపుడే భూమికి సంబంధించిన సమస్యలు పరిష్కరించినట్టు లెక్క. ఆయన ఆదేశించినట్లు జిల్లాలోని ప్రతి ఎమ్మార్వో ఒక్కొక్క గ్రామాన్ని ఎంపిక చేసుకొని రికార్డుని శుద్ధీకరించారు. నేను పెంటపాడు మండలంలోని చింతపల్లి అనే గ్రామాన్ని ఎంపిక చేసుకొని రికార్డులను స్వచ్ఛీకరించాను. ఆ గ్రామం మొత్తం విస్తీర్ణం దాదాపు ఏడు వందల ఎకరాలు. అది చిన్న గ్రామం కిందే లెక్క. నేను సిబ్బందితో కలిసి అక్కడే ఉండి రోజంతా పనిచేస్తే అంత చిన్న గ్రామ రికార్డుల శుద్ధీకరణకు దాదాపు నెల రోజులు పట్టింది. ఇప్పటి ప్రభుత్వ లెక్కల ప్రకారం చూస్తే భూములకు సంబంధించిన వ్యత్యాసాలు, సమస్యలు వేల సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది. మరి ఇంత పెద్దమొత్తంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలంటే, వ్యత్యాసాలను సరిచేయాలంటే ఎన్ని నెలలు పడుతుంది? రెవెన్యూ సిబ్బంది ఇతర ఏ పనులూ చేయకుండా దీనిపైనే కూర్చుని నిర్విరామంగా పనిచేస్తేనే నెల రోజులు పట్టింది. అటువంటిది ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలులో తలమునకలయి ఉండే రెవెన్యూ సిబ్బంది పదిహేను రోజుల్లో ఒక గ్రామంలో రికార్డుల శుద్ధీకరణ కార్యక్రమాన్ని పూర్తి చేయగలదా? అనే విషయం ఆలోచించాలి.

> **ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ముందుగా ఒక్కొక్క రెవెన్యూ డివిజన్ పరిధిలో ఒక్కొక్క గ్రామ భూ రికార్డులని శుద్ధీకరించాలి. పదిహేను రోజుల గడువులోగా దానిని పూర్తిచేసి ఆ తర్వాత యుద్ధప్రాతిపదిక మీద అన్ని గ్రామాల భూ రికార్డులను సరిచేయాలి. ఇక్కడ ఒక అంశం దృష్టిలో పెట్టుకోవాలి. దాదాపు మూడు దశాబ్దాలుగా ఎన్నోసార్లు ప్రభుత్వం రెవెన్యూ రికార్డుల శుద్ధీకరణ కార్యక్రమం చేపట్టింది. ఏనాడు కూడా ఆ కార్యక్రమం సక్రమంగా పూర్తి చేసిన దాఖలాలు లేవు.**

ఈరోజు పరిస్థితి చూస్తే ఒక వీఆర్వో రెండు మూడేళ్లు ఒక గ్రామంలో పని చేస్తారు. మూడు సంవత్సరాల కాలం పూర్తయినా పొలం అజమాయిషీ మాత్రం పూర్తికాదు. అందుకే రెవెన్యూ రికార్డులు తప్పుల తడకలుగా ఉంటాయి. దశాబ్దాల నాడు చనిపోయిన ఆసామి పేరు ఇప్పటికీ అనుభవదారుగా కొందరు చూపిస్తూనే ఉన్నారు. దానికి కారణం వీఆర్వో గత సంవత్సరపు రికార్డును కాపీ చేసి కొత్త అడంగల్ తయారు చేయటమే. రెవెన్యూ ఇన్స్పెక్టర్ కూడా దాన్ని పట్టించుకోకుండా ఆమోదించడం.

ప్రభుత్వ ఇప్పటి ఆదేశాల ప్రకారం ముందుగా ఒక్కొక్క రెవెన్యూ డివిజన్ పరిధిలో ఒక్కొక్క గ్రామ భూరికార్డుని శుద్ధీకరించాలి. పదిహేను రోజుల గడువులోగా దానిని పూర్తిచేసి ఆ తర్వాత యుద్ధప్రాతిపదిక మీద అన్ని గ్రామాల భూ రికార్డులను సరిచేయాలి. ఇక్కడ ఒక అంశం దృష్టిలో పెట్టుకోవాలి. దాదాపు మూడు దశాబ్దాలుగా ఎన్నోసార్లు ప్రభుత్వం రెవెన్యూ రికార్డుల శుద్ధీకరణ కార్యక్రమం చేపట్టింది. ఏనాడు కూడా ఆ కార్యక్రమం సక్రమంగా పూర్తి చేసిన దాఖలాలు లేవు. పదో, పదిహేను రోజులలో పని చేసిన తర్వాత ఆ పనిని పక్కన పెట్టేసి వేరే కార్యక్రమాల వైపు రెవెన్యూ సిబ్బందిని మళ్ళిస్తారు. ఒక్కోసారి ప్రకృతి వైపరీత్యాలు, ఎన్నికలు తదితర అత్యవసర కార్యక్రమాల వల్ల కూడా భూరికార్డుల ప్రత్యేక కార్యక్రమం ఆగిపోతుంది. ఇటువంటి బృహత్తర కార్యక్రమాన్ని హడావిడిగా చేయడం ఏమాత్రం సమంజసం కాదు. ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలి. ప్రతి మండలంలోని అన్ని గ్రామాలలో దశలవారీగా భూ రికార్డుల శుద్ధీకరణ జరపాలి. ఉదాహరణకి ఒక మండలంలో పదిహేను గ్రామాలు ఉంటే వాటిని ఒక్క ఏడాదిలోనో, ఒకటిన్నర ఏడాదిలోనో శుద్ధీకరణ జరిగేటట్టు ప్రణాళిక రూపొందించుకోవాలి. ఇలా ప్రతి మండలంలో చేసినట్లయితే కనీసం నెలకు కొన్ని గ్రామాలైనా శుద్ధీకరణ జరుగుతాయి. హడావిడి లేకుండా ఈ పద్ధతిలో అన్ని గ్రామాల రికార్డులను ఒకటి రెండు సంవత్సరాల కాలంలో శుద్ది చేయగలుగుతారు. అంతేగాని యుద్ధ ప్రాతిపదికపై చేయాలని తలపెడితే 'ఎక్కడ వేసిన గొంగళి...లా' అక్కడే వుంటుంది. ఇది చరిత్ర చెబుతున్న అనుభవం.

శుద్ధీకరణ కార్యక్రమం చెప్పుకోడానికి సులభంగానే ఉంటుంది గానీ ఆచరణలో చాలా సమయం తీసుకుంటుంది.. ప్రతి గ్రామంలో ఒక సర్వే నెంబరు తీసుకొని ఆ నెంబర్ లోని అందరు రైతులను ఒకచోట సమావేశ పరచాలి. ఆ నెంబరు విస్తీర్ణం ఆర్.ఎస్.ఆర్ దాఖలా ఎంత ఉందో చూడాలి. ఆ సర్వే నెంబర్ లోని రైతుల విస్తీర్ణం మొత్తం కలిపితే ఆర్.ఎస్.ఆర్ విస్తీర్ణంతో సరిపోవాలి. అలా సరిపోతే ఆ నెంబర్ లెక్క పక్కాగా తేలినట్టు. చాలా వరకు ఇలా సరిపోదు. దానికి కారణాలు చాలానే ఉన్నాయి. ఉదాహరణకి ఒక రైతుకి ఆ నెంబర్లో ఒక ఎకరం పొలం ఉన్నట్లయితే దాన్ని ఆ రైతు అమ్మేటప్పుడు ఎకరం కంటే ఎక్కువ విస్తీర్ణం రిజిస్టర్ చేస్తాడు. భూమి మీద కొలిచి కూడా చూపించవచ్చు. అమ్మే భూమి పక్క ఏ పోరంబోకు భూమినో కలిపి రిజిస్టర్ చేయవచ్చు. కానీ అది రైతుకు హక్కులేని అదనపు విస్తీర్ణం. కొనుక్కున్న రైతు ఎకరానికి పైగా పది సెంట్లో ఇరవై సెంట్లో కలిపి రిజిస్టర్ చేయించుకొని పాస్ బుక్ కోసం తహసీల్దార్‌కు దరఖాస్తు చేస్తాడు. సర్వే నెంబర్‌లోని పూర్తి విస్తీర్ణం సరి చూసుకోకుండా పాస్ బుక్ జారీ చేస్తే పోరంబోకు కూడా కలిసి పాస్ బుక్ ఇవ్వడం జరుగుతుంది. ఇలా ఒక సర్వే నెంబర్‌లోని నలుగురైదుగురు రైతులు ఎవరికి వాళ్ళు ఎక్కువ విస్తీర్ణం చూపించి పాస్ పుస్తకాలు తీసుకుని ఉంటే మొత్తం విస్తీర్ణం ఆర్.ఎస్.ఆర్ కంటే ఎక్కువ అవుతుంది. అలా గ్రామంలోని అన్ని సర్వే నెంబర్లు సరి చేయాలంటే నెలలు పడుతుంది. ఇది వాస్తవ పరిస్థితి.

దాదాపు ప్రతి మండలంలో పదిహేను నుంచి ఇరవై ఐదు వరకు గ్రామాలు ఉంటాయి. ఏ ఇతర పనులు చేయకుండా ఈ పనిని మాత్రమే చేస్తే కనీసం నెలకు ఒక గ్రామం చొప్పున పదిహేను నుంచి ఇరవై ఐదు నెలలు ఈ శుద్ధీకరణ కార్యక్రమం పూర్తిచేయటానికి పడుతుంది. అయితే దాదాపు పది పదిహేను సంవత్సరాలుగా రెవెన్యూ వ్యవస్థ భూ సంబంధిత పనులతో పాటుగా అనేక ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో, సంక్షేమ కార్యక్రమాల్లో, అత్యవసర కార్యక్రమాల్లో పాల్గొనాల్సి వస్తోంది. భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి అతి తక్కువ సమయం దొరుకుతోంది. ఇటువంటి పరిస్థితిలో రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన అనేది ఆషామాషీ వ్యవహారం కాదు. పూర్తి ప్రణాళికాబద్ధంగా తగినంత సమయం కేటాయించి చేయాల్సిన పని. అంతేకాకుండా భూముల సమస్యల తీవ్రతలోనూ వ్యత్యాసం ఉంది. డెల్టా ప్రాంతాల్లో కంటే మెట్ట ప్రాంతంలో సమస్యలు ఎక్కువగా ఉంటాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో మరికొన్ని భిన్నమైన సమస్యలుంటాయి. డెల్టా ప్రాంతాల్లో భూమి యాజమాన్య హక్కులు ఎక్కువ భాగం నిర్ధారితమై వుంటాయి. ఈ విషయాలను కూడా దృష్టిలో పెట్టుకుని రెవెన్యూ సిబ్బందికి తగిన సమయం కేటాయించాలి. రెవెన్యూ సిబ్బంది కూడా చిత్తశుద్ధితో, అంకితభావంతో పనిచేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా గ్రామ రెవెన్యూ అధికారులు గ్రామంలోని పొలాలన్నీ అజమాయిషీ చేసి యాజమాన్య హక్కులను నిర్ధారించుకోవాలి. సర్వే సిబ్బంది సమన్వయంతో పని చేసి చిన్న చిన్న విస్తీర్ణపు తేడాలను సరిచేయాలి. అప్పుడే ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే 'స్పందన' కార్యక్రమానికి కాళ్లరిగేలా తిరిగే రైతులు సంఖ్య తగ్గుతుంది. దీనిని హడావుడిగా పూర్తి చేసే కార్యక్రమంలా కాకుండా నూటికి నూరుపాళ్ళు ప్రణాళికాబద్ధంగా సమయం కేటాయించి చేయాలి. దానికోసం తగిన సిబ్బందిని కేటాయించాలి. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా భావించి సజావుగా పూర్తి చేస్తే రైతాంగం గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోవచ్చు.అందుకే ఈ శుద్ధీకరణ కార్యక్రమాన్ని మొక్కుబడిగా కాకుండా త్రికరణశుద్ధిగా పూర్తిచేయాలి

■ **సోమేపల్లి వెంకట సుబ్బయ్య**

విశ్రాంత డిప్యూటీ కలెక్టర్